క్లుప్తంగా

ఎర్రచందనం జోలికి వెళితే తాట తీస్తాం

– మైదుకూరు డీఎస్పీ టి.వెంకటేశులు



కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ వెంకటేశులు

మైదుకూరు : ఎర్రచందనం అక్రమ రవాణా చేయాలని చూస్తే తాట తీస్తామని మైదుకూరు డీఎస్పీ టి.వెంకటేశులు హెచ్చరించారు. శనివారం మైదుకూరు పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లోని ఎర్రచందనం కేసుల్లో ఉన్న 163 మందికి ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణాతో జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టిబడితే కేసులు నమోదు చేయడమేగాక పీడీ యాక్ట్ కూడా అమలు చేస్తామని హెచ్చరించారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ డివిజన్‌లోని పోలీసు అధికారులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆషాఢమాసం చివరి శనివారం సందర్భంగా స్వామి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు.

వరుణ దేవుడికి ప్రత్యేక పూజలు



ఆంజనేయ స్వామికి జలాభిషేకం చేస్తున్న సుంకేశుల గ్రామస్థులు

ఖాజీపేట : మేఘాలు మేఘామృతమై వర్ష సూచన కనిపించినా ఒక్క రోజూ వర్షం కురవడం లేదు.. దీంతో గ్రామస్థులు వరుణదేవుడి కరుణ కోసం శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖాజీపేట మండలం సుంకేశుల గ్రామంలోని రైతులు వరుణ దేవున్ని ప్రార్థిస్తు గ్రామంలో ఆరాధ్య దైవంగా ఉన్న ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకం చేశారు. వరుణుడు కరుణించి రైతుల కష్టాలను తొలగించాలని ప్రార్థించారు.

ఉచిత కంటి పరీక్షలు

కాశినాయన : మండలంలోని వరికుంట్ల గ్రామంలో ఎంపీటీసీ రమణ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కడప పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు మనోజ్ కుమార్, అమర్‌నాథ్‌రెడ్డిలు 250 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కొంత మందికి ఆపరేషన్ కోసం రెఫర్ చేశారు. వీరందరికి ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తామని డాక్టర్లు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరిస్తాం

కాశినాయన : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. శనివారం మండలంలో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 117 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని, అలాగే ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని, ఆర్జిత సెలవుల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. వివిధ కారణాల చేత నిలిచిపోయిన భాషా పండితుల పదోన్నతులను వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి, సభ్యులు రాంభూపాల్‌రెడ్డి, సత్తార్, ఏపీటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

జీవాలకు సీజనల్ వ్యాధుల ముప్పు

- నీలినాలుక, చిటుకు వ్యాధులపై అప్రమత్తత అవసరం
- సకాలంలో గుర్తించకపోతే తీవ్ర నష్టం
- సూచనలు, సలహాలు పాటించాలంటున్న పశువైద్యులు



కొర్రపాడులో జీవాలకు నీలినాలుక వ్యాక్సిన్ వేస్తున్న కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీ డాక్టర్ వెంకటేశ్వర్లు

రాజుపాళెం : నియోజకవర్గంలో వ్యవసాయం, పాడి తర్వాత ఎక్కువ మంది జీవాల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో జీవాల్లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే పెంపకందారులు నష్టపోవాల్సి వస్తుందని పశువైద్యులు అంటున్నారు. ప్రొద్దుటూరు మండలంలోని కామనూరు, తాళ్లమాపురం, బొజ్జవారిపల్లె, బొల్లవరం, ప్రొద్దుటూరులోని పెద్దాసుపత్రి ఎదురుగా ఉన్న ఐదు పశు వైద్యశాలల పరిధిలో 23,914 గొర్రెలు, 5,518 మేకలు ఉన్నాయి. రాజుపాళెం మండల పరిధి కొర్రపాడు, రాజుపాళెం, గాదెగూడూరు, పర్లపాడు గ్రామాల్లోని పశువైద్యశాలల పరిధిలో 7,009 గొర్రెలు, 6,287 మేకలు ఉన్నాయి. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో మూగ జీవాలకు సీజనల్ ముప్పు పొంచి ఉంది. వర్షాల కారణంగా గొర్రెలకు ముఖ్యంగా నీలినాలుక, చిటుకు వ్యాధి వ్యాపించే అవకాశం ఉంది. సకాలంలో వ్యాధులను గుర్తించకపోతే జీవాలు చనిపోయే ప్రమాదం ఉంది. జీవాల పెంపకందారులు పశువైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తే జీవాలకు సోకే వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చు.

నీలినాలుక (బ్లూటంగ్) వ్యాధి

ఈ వ్యాధి ఆర్బి వైరస్ క్రిముల ద్వారా క్యూలికాయిడ్స్ అనే దోమ కాటు వల్ల గొర్రెలకు వ్యాపిస్తుంది. వర్షాకాలంలో ఈ దోమల తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల వ్యాధి తీవ్రత కూడా అధికంగా ఉండి గొర్రెలు చనిపోయే ప్రమాదం ఉంది. ఈ దోమ కాటు ద్వారా ఈ వైరస్ రక్తంలోకి చేరి రక్త కణాలను నాశనం చేస్తుంది. ఫలితంగా రక్త కణాలు విచ్ఛిన్నం కావడం, గడ్డకట్టుకు పోవడం జరిగి శరీరంలోని వివిధ భాగాల్లో రక్తస్రావం జరిగి, నీరు చేరి చివరికి గొర్రెలు చనిపోతుంటాయి.

చిటుకు వ్యాధి

ఈ వ్యాధి ఆరోగ్యంగా ముఖ్యంగా బద్దె పురుగులు ఉన్న గొర్రెల్లో ఎక్కువగా వస్తుంది. క్లాస్ట్రిడియమ్ ఫెర్ ఫ్రిజన్స్ డి అనే బ్యాక్టీరియా వల్ల సోకుతుంది. చిటుకు వ్యాధిని కలిగించే సూక్ష్మజీవులు గడ్డికి అంటుకున్న మట్టి ద్వారా గొర్రెల కడుపులోకి వెళ్తాయి. కొన్ని సూక్ష్మజీవులు కడుపులో నశిస్తాయి. మరికొన్ని పేగుల వరకు వెళ్లి అక్కడ విష పదార్థాన్ని వదులుతాయి. ఈ విష పదార్థాన్ని గొర్రెలు మలం ద్వారా బయటకు వదులుతాయి. అయితే కొన్ని సందర్భాల్లో సూక్ష్మజీవులు ఎక్కువై గొర్రెలు గిలగిలా కొట్టుకుని చనిపోతాయి. గొర్రెలు చనిపోయే ముందు పొట్ట ఉబ్బసం, వణుకు, తలను నేలకు వాల్చడం, పళ్లు కొరకడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

లక్షణాలు

- ఈ వ్యాధి సోకినప్పుడు గొర్రెల్లో 104 నుంచి 106 ఫారెన్‌హీట్ డిగ్రీల వరకు జ్వరం ఉంటుంది.
- నాలుకలోని రక్త నాళాలు వాచిపోవడం వల్ల నాలుక నీటి రంగులోకి మారిపోతుంది.
- ముక్కులో నుంచి జిగురు వంటి ద్రవం కారుస్తుంది.
- కాలిగిట్టల మధ్య, పైభాగంలో చీము పట్టి నడవలేక కుంటుతుంటాయి.
- ఆకలి మందగించి మేత తినవు.. దీంతో బరువు తగ్గుతాయి.

చికిత్స

- వ్యాధి సోకిన గొర్రెలను మందలో నుంచి వేరుచేయాలి.
- నోటి పుండ్లు ఉండడం వల్ల ఆహారాన్ని జీర్ణం చేసుకోలేవు. తేలిగ్గా జీర్ణం అయ్యే గంజి లాంటిది ఉప్పు కలిపి తాగించాలి.
- నొప్పి తగ్గడం కోసం ఇంజెక్షన్లు వేయించాలి. అలాగే సెకండరీ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ సోకకుండా యాంటీ బయోటిక్స్, బీకాంప్లెక్స్ ఇంజక్షన్స్ వేయాలి.

సకాలంలో టీకాలు వేయించాలి



జీవాల పెంపకందారులు సకాలంలో టీకాలు వేయించడం వల్ల వ్యాధుల నుంచి జీవాలను రక్షించుకోవచ్చు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. జీవాలను గమనిస్తూ ఏదైనా సమస్య ఉంటే పశువైద్యులను సంప్రదించాలి. బ్లూటంగ్ వ్యాధి నిరోధక టీకాలను మూడు నెలలు దాటిన గొర్రె పిల్లలకు వేయించాలి. ప్రస్తుతం బ్లూటంగ్ వ్యాక్సిన్ వేస్తున్నాం. మళ్లీ నెల తరువాత బూస్టర్ డోస్ వేయించాలి.

– డాక్టర్ వెంకటేశ్వర్లు, పశుసంవర్ధక శాఖ ఏడీ, పెద్దముడియం, రాజుపాళెం మండలాలు

ముగ్గురు కౌన్సిలర్లు టీడీపీలో చేరిక



కౌన్సిలర్ స్వాతిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో ముగ్గురు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు శనివారం టీడీపీలో చేరారు. 16వ వార్డు కౌన్సిలర్ మోపూరు రేవతి, 21వ వార్డు కౌన్సిలర్ కొవ్వూరు స్వాతి, 36వ వార్డు కౌన్సిలర్ అలవలపాటి అరుణ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, ఈవీ సుధాకర్ రెడ్డి, ముక్తియార్ పాల్గొన్నారు.

పొలతలలో కల్యాణ మండపం నిర్మించాలి

కడప కల్చరల్ : జిల్లాలో సుప్రసిద్ధ శైవక్షేత్రం, పర్యాటక ప్రాంతమైన పొలతల శ్రీ మల్లేశ్వరస్వామి క్షేత్రంలో విలాసమైన కల్యాణ మండపం నిర్మించాలని రాష్ట్రీయ హిందూ సేవా వాహిని సంఘటన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిద్దలూరు రమేష్ పొలతల ఈఓ కె.శ్రీనివాసులును కోరారు. ఈ మేరకు ఆయన శనివారం ఈఓ కార్యాలయంలో ఈఓను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. పొలతల మల్లేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రితోపాటు కార్తీకమాసంలో శివ పార్వతుల కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ ఉత్సవాన్ని దాదాపు ఐదు వేలమందికి పైగా వీక్షించేందుకు వీలుగా నూతన కల్యాణ మండపాన్ని నిర్మించాలని కోరారు.

నేడు చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలు





సుబ్బిరెడ్డి కొట్టాలు చౌడేశ్వరిదేవి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సెట్టింగ్, ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు చౌడేశ్వరిదేవి ఆలయాల్లో చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రామేశ్వరం మోరీల వద్ద ఉన్న చౌడేశ్వరీదేవాలయం, ఆర్టీపీపీ రోడ్డులోని అష్టభుజ మహాచౌడేశ్వరిదేవి, వసంతపేట, సుబ్బిరెడ్డికొట్టాల, పప్పుల బజార్, వినాయకనగర్, ఆచార్లకాలనీ, విజయనగరం వీధితోపాటు అన్ని చౌడేశ్వరిదేవి ఆలయాల్లో ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేయనున్నారు. కొన్ని ఆలయాల్లో మధ్యాహ్నం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా బారికేడ్లను ఏర్పాటు చేశారు. అమ్మవారి జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆలయాలకు రంగులు వేయించడంతోపాటు విద్యుత్ దీపాలతో అలంకరించారు. చలువపందిళ్లను ఆలయాల ముంగిళ్లలో ఏర్పాటు చేశారు. కొందరు ఆలయాల నిర్వాహకులు రాత్రి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పట్టణంలో సుమారు 18పైగా చౌడేశ్వరి దేవి ఆలయాలు ఉన్నాయి. చేనేత కులాలవారితోపాటు అందరూ అమ్మవారిని ఆరాధ్య దైవంగా కొలుస్తున్నారు. జయంతి ఉత్సవాల్లో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అన్న ప్రసాదాలను స్వీకరించాలని ఆలయాల నిర్వాహకులు కోరారు.

జీవన ఎరువులతో నాణ్యమైన మిరప పంట



మాట్లాడుతున్న డాక్టర్ కరుణశ్రీ

మైదుకూరు : జీవన ఎరువులతో నాణ్యమైన మిరప పంటను పండించవచ్చని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ కరుణశ్రీ అన్నారు. మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం మిరప సాగుపై జిల్లా స్థాయి రెండో రోజు కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కరుణశ్రీ మాట్లాడుతూ మిరప సాగులో క్రిమిసంహారక మందులకు బదులుగా జీవన ఎరువులు వినియోగించాలని సూచించారు. దీని వల్ల నాణ్యతతోపాటు అధిక దిగుబడులు కూడా వస్తాయన్నారు. మిరప నాటిన నెల తర్వాత తెగుళ్ల నివారణ కోసం బ్లూ స్టిక్ ట్రాప్ (నీలం కర్ర ఉచ్చు)లను పొలంలో ఏర్పాటు చేయాలని సూచించారు. కేవీకే అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ మాట్లాడుతూ మిరప సాగులో యాజమాన్య పద్ధతులను వివరించారు. పులివెందుల అరటి పరిశోధన కేంద్రం కీటక శాస్త్రవిభాగం శాస్త్రవేత్త డాక్టర్ బి.నాగేంద్రారెడ్డి, వనిపెంట కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోరజ్ హుస్సేన్, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బీఎస్ కాంతిశ్రీ మిరపలో విలువ జోడింపు గురించి, తెగుళ్లు, చీడపీడల నివారణ గురించి రైతులకు వివరించారు. అనంతరం శాస్త్రవేత్తలు, రైతులు మండలంలోని సుంకులు గారిపల్లె, మాచుగారిపల్లె, మిట్టమానుపల్లె గ్రామాల్లో రైతులు సాగు చేసిన మిరప, ఉల్లి, అరటి, నేల సంపంగి, బంతి తదితర పంటలను సందర్శించి పరిశీలించారు.

రాజకీయ స్వార్థం కోసమే ఎస్సీ వర్గీకరణ



డిప్యూటీ తహసీల్దారుకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

చాపాడు : రాజకీయ స్వార్థం కోసం షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలను విభజిస్తున్నారని.. ఎస్సీ ఎస్టీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు జిల్లా నాయకులు వెంకటసుబ్బయ్య, బండి పుల్లయ్య అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు చర్యలు తీసుకోవచ్చని సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చిన క్రమంలో సుప్రీం కోర్టు మరో సారి పునఃపరిశీలించాలని శనివారం డిప్యూటీ తహసీల్దారు యామినికి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళితులందరూ ఐకమత్యంగా ఉంటూ అభివృద్ధి చెందాలనే ఆశయంతో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ రిజర్వేషన్లు తీసుకొచ్చారన్నారు. రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం ఎస్సీ ఎస్టీ వర్గీకరణ చేసేలా ఒత్తిడి చేస్తున్నారని, మాల, మాదిగల మధ్య గొడవలు సృష్టించేందుకే నాయకులు కుట్రలు పన్నుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



ప్రొద్దుటూరు క్రైం : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది



మాధవరాయునిపల్లెలో తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి



చాపాడులో తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

ప్రొద్దుటూరు క్రైం : తల్లి పాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని వైద్యాధికారి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శ్రీనివాసనగర్‌లోని సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే 1గంటలోపు తల్లిపాలు ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దినేష్‌బాబు, డీపీఎంఓ శివశంకరయ్య, ఎంపీహెచ్ఈఓ రాజారత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, కమ్యూనిటీ ఆర్గనైజర్ నాగజ్యోతి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

శంకరాపురంలో..

మండలంలోని శంకరాపురం గ్రామంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కామనూరు పీహెచ్‌సీ సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరీ మాట్లాడుతూ తల్లికి చిన్నపాటి అనారోగ్యం చేసినా వెంటనే డాక్టర్లను సంప్రదించి వైద్యం చేయించుకోవాలని చెప్పారు. అనంతరం గర్భిణీలకు సీమంతం, అన్నప్రాసన చేసి, గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ అంజలి, ఏఎన్ఎం సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు గీతాలక్ష్మి, రామలక్ష్మి, హజరాబి, ఆయా ప్రకాశమ్మ, ఆశా కార్యకర్తలు లక్ష్మీదేవి, వరలక్ష్మి, గర్భిణులు, బాలింతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజుపాళెం : మండలంలోని అర్కటవేముల గ్రామంలో శనివారం తల్లులకు, గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ అరుణకుమారి, సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, విజయేశ్వరి, కార్యకర్తలు సుబ్బరత్నమ్మ, లక్ష్మీదేవి, వసుంధర, ఆయా సుబ్బమ్మ, ఆశా బయమ్మ పాల్గొన్నారు.

ముర్రుపాలే బిడ్డకు మొదటి టీకా

బి.కోడూరు : తల్లి ముర్రుపాలే బిడ్డకు మొదటి టీకా అని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు తెలిపారు. శనివారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మాధవరాయునిపల్లె, అక్కుపాలెం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి అక్కడ జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. అలాగే తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు జయంతి, ప్రియదర్శిని, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఏఎన్ఎంలు లక్ష్మీదేవి, రేష్మ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలే శ్రేయస్కరం

చాపాడు : పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రు పాలు దిపించటం శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ అన్నారు. మండల కేంద్రమైన చాపాడులోని దళితవాడలోపా అంగన్వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు దిపించటం వలన పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. 6 నెలలు నిండిన చిన్నారులకు తల్లిపాలతో పాటు అంగ్వాడీ కేంద్రాలలో అనుబంధమైన పోషకాహారాన్ని అందించాలన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రం పరిధిలో ఆయా గ్రామాలలోని తల్లుకు తల్లి పాల విశిష్టతపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరంలో చాపాడులో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ రోజమ్మ, హెల్పర్ సలోమి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

కాశినాయన : తల్లి ముర్రుపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని, తల్లిపాలే బిడ్డకు మొదటి వ్యాధినిరోధక టీకా అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ తెలిపారు. శనివారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఏఎన్ఎం, ఆశావర్కర్ల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించి అనంతరం అవగాహన కల్పించారు. తల్లిపాల విశిష్టతను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. బాల్యవివాహాలతో అనర్థాలు తలెత్తుతాయని, వీటి నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు.

తహసీల్దారుగా బాధ్యతల స్వీకరణ





కలసపాడు, బద్వేలు తహసీల్దార్లుగా బాధ్యతలు స్వీకరిస్తున్న మహబూబ్‌బాషా, ఉదయభాస్కర్‌రాజు

బద్వేలు అర్బన్ : బద్వేలు తహసీల్దారుగా డి.ఉదయ భాస్కర్‌రాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో జిల్లాలోని బి.కోడూరు, పెండ్లిమర్రి మండలాల్లో తహసీల్దారుగా పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బద్వేలు మండలంలో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు.

కలసపాడులో..

కలసపాడు : మండల తహసీల్దారుగా డి.మహబూబ్‌బాషా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజల అర్జీలపై దృష్టి సారిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన మహబూబ్‌బాషాను శాలువా, పూలమాలలతో సన్మానించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందనలు



క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న రెడ్డిసేవా సంఘం నాయకులు

బద్వేలు అర్బన్ : జంప్‌రోప్‌లో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన సౌమ్యారెడ్డి, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన నందగోపాల్‌రెడ్డిలను శనివారం రెడ్డిసేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని రెడ్డిసేవా సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సాంబశివారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, తద్వారా తల్లిదండ్రులకు, పాఠశాలకు, వారి స్వగ్రామాలకు ఉన్నతమైన గౌరవం దక్కుతుందన్నారు. భవిష్యత్తులో మరెన్నో పోటీల్లో పాల్గొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రెడ్డిసేవా సంఘం గౌరవాధ్యక్షుడు కె.వి.సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గంగాధరానంద గిరిస్వామి సేవలు మరువలేనివి



గంగాధరానంద గిరి స్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నరాల రామారెడ్డి, ఉపాధ్యాయులు

ప్రొద్దుటూరు కల్చరల్ : శ్రీకృష్ణగీతాశ్రమం పూర్వ పీఠాధిపతి గంగాధరానంద గిరిస్వామి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారని, ఆయన సేవలు మరువలేనివని ప్రముఖ అవధాని నరాల రామారెడ్డి పేర్కొన్నారు. స్థానిక గీతాశ్రమంలోని మళయాల స్వామి బీఈడీ కళాశాలలో శనివారం కరస్పాండెంట్ సురేష్‌బాబురెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారి 4వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగాధరానంద గిరి స్వామి గీతాశ్రమాన్ని అభివృద్ధి చేసి ఆధ్యాత్మిక భావనలను పెంపొందించారన్నారు. ఆశ్రమంలోని విద్యాసంస్థల ద్వారా పేద విద్యార్థుల విద్యకు తోడ్పాటు అందించారని కొనియాడారు. తాను కూడా ఆశ్రమంలోని ఓరియంటల్ పాఠశాలలో చదువుకున్నానన్నారు. ఈ పాఠశాలలో సంస్కృతం నేర్చుకోవడం వలనే అవధానిగా దేశ వ్యాప్తంగా ఖ్యాతి గడించానని లేకుంటే ఏ ఉద్యోగమో చేసుకునే వాడినని తెలిపారు. ప్రముఖ వ్యాపార వేత్త సీవీ సుబ్బారావు మాట్లాడుతూ నామా ఎరుకలయ్య, నామా కమలాక్షమ్మ, గంగాధరానంద గిరి స్వామివారి ఆశయాల సాధనకు కృషి చేస్తామన్నారు. గీతాశ్రమంను దేవాదాయశాఖ నుంచి తీసుకుని ఒక ట్రస్టు ఏర్పాటు చేసి దీని ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ముందుగా అందరు గంగాధరానంద గిరిస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఓరియంటల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సుధీర్, ఉపాధ్యాయుడు కుమార్, మళయాలస్వామి బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ ధనరాజ్, డీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరయ్య, రామనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల ఆస్తులను కాపాడుకుందాం

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

కడప రూరల్ : క్రైస్తవ ఆస్తులను కాపాడుకుందాం అని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో రాయలసీమ డయాసిస్ (సీఎస్ఐ టీఏ) ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు జీవీ రమణ, రాయలసీమ అధ్యక్ష మండల దైవ జనులు, డివిజనల్ చైర్మన్ రెవరెండ్ ఐక్యతరావ్‌బాబు, జీఆర్‌డీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కారు అంజనేయులు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి జాతీయ కన్వీనర్ సంగటి మనోహర్, బీసీ నేత అవ్వారు మల్లిఖార్జున మాట్లాడుతూ క్రైస్తవులు, చర్చికి సంబంధించిన ఆస్తులకు దశాబ్దాల చరిత్ర ఉందన్నారు. ఇందుకు సంబంధించిన ఆస్తులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు.